క్లుప్తంగా

ఈఎల్ఆర్‌లో రోగి వివరాలు

క్రోసూరు: పీహెచ్‌సీకి వచ్చిన ప్రతి రోగి వివరాలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు(ఈఎల్ఆర్)లో నమోదు చేయాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ పీహెచ్‌సీ సిబ్బందికి చెప్పారు. గురువారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు తీరును పరిశీలించారు. సిబ్బంది అందరూ సమయానికి విధులకు హాజరు కావాలన్నారు. సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. గర్భిణుల రిజిస్ట్రేషన్‌ను పెంచాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ప్రతిరోజూ పోర్టల్‌లో గర్భిణులు, పిల్లల సర్వీసులను నమోదు చేయాలన్నారు. ఇన్ పేషెంట్లు, ఓపీ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు గఫ్రూన్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్, ఫార్మసిస్ట్ ఫాతిమా తదితరులు ఉన్నారు.

'అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్1.0'పై అవగాహన ఉండాలి



సత్తెనపల్లి: పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 1.0 పై ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన ఉండాలని సత్తెనపల్లి డీఎల్‌డీవో రాజగోపాల్ అన్నారు. సత్తెనపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్-1.0 పై మండల పరిషత్ అధ్యక్షులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు అందరూ తమ లాగిన్‌లోకి వచ్చిన డేటాను పరిశీలించి, ఫార్వర్డ్ చేయాలని సూచించారు. శిక్షణలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి డెప్యూటీ ఎంపీడీఓ షేక్ అజీజుర్ రెహమాన్, పంచాయతీ కార్యదర్శి చిలువూరి కృష్ణప్రసాద్ ట్రైనర్లుగా వ్యవహరించారు. జూనియర్ అసిస్టెంట్ విజయసుందర్‌దాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ సబ్‌స్టేషన్ల పరిధి.. మాచాయపాలెం ఫీడర్ గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని బెల్లంకొండ ఏఈ పవన్ కుమార్ తెలిపారు. మాచాయపాలెం ఫీడర్‌లో 11కేవీ లైన్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. న్యూ చిట్యాల ఆర్ ఆర్ సెంటర్, చంద్రాజుపాలెం, కందిపాడు గ్రామాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ ఉండదని పేర్కొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

సత్తెనపల్లి: సెల్‌ఫోన్ మాట్లాడొద్దని తల్లిదండ్రులు మందలించడంతో ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాకు చెందిన వంట చేసే దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. వారి పెద్ద పెద్ద కుమార్తె జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో నాగార్జున నగర్‌కు చెందిన షేక్ బంగారం అనే యువకుడితో ఆ యువతి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతోందని తల్లిదండ్రుల్లో సంశయముంది. దీనిలో భాగంగా ఈ నెల 23న ఆమె సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా తల్లిదండ్రులు కుమార్తెను మందలించారు. అనంతరం వారు వంట పనికి వెళ్లడంతో అదే రోజు సాయంత్రం కుమార్తె ఇంటి నుంచి ఆరు సవర్ల బంగారు ఆభరణాలు, కొంత వెండి తీసుకొని కనిపించకుండా వెళ్లిపోయింది. తల్లిదండ్రులు పలుచోట్ల వెదికినా సమాచారం లేకపోవడంతో ఆమె తల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లాప్ మిత్రల సేవలు వెలకట్టలేనివి

నూజెండ్ల: గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడంలో క్లాప్‌మిత్రలు (పారిశుద్ధ్య కార్మికులు) ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా నూజెండ్ల, ఉప్పలపాడు, జడ్డావారిపాలెం, చెరుకుంపాలెం, గ్రామ సచివాలయంల్లో గురువారం క్లాప్ మిత్రలకు సన్మానం చేశారు. ఆమె మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం గ్రామాల సర్పంచ్‌లతో కలిసి శ్రమదానంలో పాల్గొన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ, సొసైటీ పర్సన్ బచ్చు అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రవీంద్ర బాబు, రామకృష్ణ, లాలు, స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ సుబ్బరామయ్య, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

చిలకలూరిపేటటౌన్: విద్యార్థులు ఉద్యోగాల అన్వేషణ కాదు.. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పల్నాడు ఇండస్ట్రీస్ సెంటర్ ఆఫీసర్ ఎం.నవీన్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాలలో గురువారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రోగ్రాం జరిగింది. విశాఖపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ డి.వీరయ్య అధ్యక్షత వహించారు. విద్యార్థులు సృజనతో పని చేయాలని అతిథులు సూచించారు.

కాత్యాయనీ కల్పవల్లి

దసరా ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి: భక్తజనం జగజ్జననికి జేజేలు పలికారు. శరన్నవరాత్రుల్లో నాలుగోరోజు గురువారం అమ్మవారిని అపురూపంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీకాత్యాయనీదేవిగా, త్రిశక్తి దుర్గాపీఠంలో వరికంకులతో ధాన్య దుర్గాదేవిగా, గుంటూరు రోడ్‌లోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా, వెంకటపతి కాలనీలోని లక్ష్మీప్రత్యంగిరా అమ్మవారి పీఠంలో శ్రీనీలంపాటి లక్ష్మీ అమ్మవారిని కాత్యాయనీదేవిగా, మున్సిపల్ కార్యాలయ సమీపంలోని మేదర సంఘ రామాలయంవద్ద కాత్యాయనీదేవిగా, వడ్డవల్లి పెద్దబొడ్డురాయి సెంటర్‌లో కాత్యాయనీదేవిగా, కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టువద్ద సంతానలక్ష్మీదేవిగా, వడ్డవల్లి శ్రీరామాలయం వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద అమ్మవారిని కాత్యాయనీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెదమక్కెన శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో కాత్యాయనీదేవిగా అలంకరించి పూజలు చేశారు.



అనంతవరంలో లలితాత్రిపురసుందరీదేవీగా అమ్మవారు

క్రోసూరు: క్రోసూరు వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు గురువారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయంలో బతుకమ్మ జరిగింది.

ముప్పాళ్ల: లంకెలకూరపాడులో దసరా ఉత్సవాల్లో భాగంగా శివాలయంలో కాత్యాయనిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లి శివాలయంలో గురువారం శ్రీఅన్నపూర్ణాదేవి కాత్యానిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



పెదమక్కెన: మల్లికార్జునస్వామి దేవాలయంలో శ్రీకాత్యాయనీదేవి

- అంకమ్మ దేవాలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని కాత్యాయనీదేవిగా దర్శించుకున్నారు.

అనంతవరం(క్రోసూరు): అనంతవరం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో లలితాత్రిపుర సుందరీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. .

అచ్చంపేట: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గురువారం అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా కనువిందు చేశారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు.

బెల్లంకొండ: స్థానిక మహాలక్ష్మీ పీఠంలో అమ్మవారిని కాత్యాయనీదేవిగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



అచ్చంపేట వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో..



వడ్డవల్లి పెద్ద బొడ్డురాయి సమీపంలో..



రాజుపాలెం బ్రాహ్మణపల్లి శివాలయంలో..



శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీకాత్యాయనీదేవి



త్రిశక్తి దుర్గా పీఠంలో వరికంకులతో ధాన్య దుర్గాదేవి



సత్తెనపల్లి: కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద సంతానలక్ష్మీదేవి

బడుగు, బలహీనవర్గాలు ఆర్థికంగా ఎదగాలి



నకరికల్లు: బడుగు, బలహీనవర్గాలు విద్య, ఆర్థికంగా ఎదగాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ స్టేట్ కో ఆర్డినేటర్ హేమలత అన్నారు. డీబీఆర్‌సీ నకరికల్లు ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీకాలనీల్లో గురువారం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. చల్లగుండ్ల ఎస్టీ చెంచుకాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

హత్యకు గురైన మస్తాన్ మృతదేహానికి పోస్ట్‌మార్టం

సత్తెనపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో పట్టణంలోని శ్రీలక్ష్మీ థియేటర్ సమీపంలో టీ కొట్టులో బావమరిది చేతిలో దారుణ హత్యకు గురైన షేక్ మస్తాన్ మృతదేహానికి పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని మృతుడి తల్లి హనీఫా, కుటుంబ సభ్యులకు అందించడంతో వారు అంత్యక్రియలు నిర్వహించారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లికి చెందిన గంగధారి మేఘన శ్రీ చిన్నారి అనారోగ్యంతో బాధపడుతోంది. చిన్నారి వైద్యానికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 10 లక్షల చెక్కును ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం అందించారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించండి

సత్తెనపల్లి: గ్రామాల్లో హరిత రాయబారులతో చెత్త సేకరణ సమయంలో కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్‌లు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించాలని సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు అన్నారు. కమిషనర్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండలం నందిగామ సుప్రీం లోకల్ ట్రైనింగ్ (ఎల్‌టీసీ)లో గురువారం అమరావతి, అచ్చంపేట, బొల్లాపల్లి, దాచేపల్లి మండలాల నుంచి ఎంపికైన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ప్రతి సీఆర్పీకి కేటాయించిన 1000 కుటుంబాల్లో 100 శాతం అవగాహన కల్పించడం, వ్యర్థాలను విడదీయడానికి అలవాటు చేయాలన్నారు. చెత్త రహిత గ్రామాల సాధన, బిన్ - బ్యాగ్ విధానంపై అవగాహన, కమ్యూనికేషన్ స్కిల్స్, మాస్క్, గ్లౌజెస్ ఉపయోగించు విధానం పై అవగాహన కల్పించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ ఆర్.నరసింహ నాయక్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని మిగిలిన 24 మండలాలకు చెందిన సీఆర్పీలకు 2025 అక్టోబర్ 1 వరకు ప్రతి రోజూ శిక్షణ జరుగుతుందని చెప్పారు. డెప్యూటీ ఎంపీడీవో షేక్ అజీజుర్ రెహమాన్, సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు కుంభా వెంకటేశ్వర్లు, చిలువూరి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సీఆర్పీకు శిక్షణ ఇస్తున్న జిల్లా రిసోర్స్ పర్సన్ నరసింహనాయక్

అందరూ ఆరోగ్యంగా ఉండాలి



మాదల(ముప్పాళ్ల): అందరూ ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్లు సూచించారు. మాదలలో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం గురువారం జరిగింది. శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి జయకృష్ణప్రవీణ్ 90 మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందించారు. శిబిరాన్ని డెప్యూటీ డీఎంహెచ్‌ఓ పద్మావతి సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దస్తగిరి, సూపర్‌వైజర్‌లు పీటర్ డేమియన్, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురిలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజనాయక్, ఆయుష్ డాక్టర్స్ ఆర్.శ్రీనివాస్‌లు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్‌లు స్వర్ణలత, కాంచన, సీహెచ్‌వో వసంతరావు, ప్రియదర్శిని, శిరీష, తేజస్విని, హెల్త్ సూపర్‌వైజర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సత్తెనపల్లిలో అందరూ భాగస్వాములే

సత్తెనపల్లి: స్వచ్ఛ సత్తెనపల్లిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనందరావు పిలుపునిచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛతాహీ సేవలో భాగంగా స్వచ్ఛ ఉత్సవ్-2025 నినాదంతో గురువారం పట్టణంలో ఏకే దిన్-ఏక్ గంట - ఏక్ సాత్ శ్రమదానం పేరుతో పరిసరాల పరిశుభ్రతను చేయించారు. సందర్భంగా పట్టణంలోని రైల్వేస్టేషన్ తాలూకా సెంటర్, ఆర్టీసీ బస్‌స్టాండ్, ఎన్జీవో హోం సెంటర్, గోళ్ళమూడివారి వీధి, గడియార స్తంభం రోడ్డు, గాంధీబొమ్మల రోడ్డు, రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ ఏరియా, వేణుగోపాల స్వామి గుడిరోడ్డు, వడ్డవల్లి ఆంజనేయస్వామి గుడి రోడ్డు, పలు కమర్షియల్ ప్రదేశాల్లో గంట సేపు పరిసరాల పరిశుభ్రత చేశారు. ఆయా ప్రాంతాలను మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, ఎన్జీవోలు, శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రిలు, మెప్మా సిబ్బంది, పురపాలక సంఘ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి: లేమల్లె పంచాయతీలో గురువారం స్వచ్ఛ ఉత్సవ్‌లో భాగంగా 'ఏక్ దిన్ -ఏక్ గంట -ఏక్ సాత్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల పరిషత్ అధ్యక్షుడు మేకల హనుమంతరావు, సత్తెనపల్లి డివిజనల్ డెవలప్మెంట్ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారి, అమరావతి స్పెషల్ ఆఫీసర్ రాజగోపాల్, ఎంపీడీవో పార్వతి, సర్పంచి ఉగ్గం పున్నమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ హనుమంతరావు మాట్లాడుతూ స్వచ్ఛోత్సవ్‌ను వచ్చే నెల 2 వరకు ప్రతిరోజూ నిర్వహిస్తామన్నారు. సత్తెనపల్లి డీఎల్పీఓ రాజగోపాల్ మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమిస్తామన్నారు. అనంతరం స్వచ్ఛత ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో డ్వాక్రా మహిళలు, ఎంజీఎన్ఆర్జీఎస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని శుభ్రం చేయిస్తున్న కమిషనర్ ఆనంద్‌కుమార్, ఎస్ఐ విజయసారథి



పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యం



డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డిని సత్కరిస్తున్న షేక్ జానీ, పెద్దింటి నాగేశ్వరరావు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామని ఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన షేక్ జానీ (గుంటూరు జానీ), ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన పెద్దింటి నాగేశ్వరరావు అన్నారు. వారు గురువారం వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జానీ, నాగేశ్వరరావు మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకంతో మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జూపల్లి పాల్, మున్నా(పెదబాబు), ఆశిక్, బాషా తదితరులు ఉన్నారు.



అనుబంధ సంఘాల సభ్యులతో సుధీర్‌భార్గవ్ రెడ్డి, మండల కన్వీనర్ రాఘవరెడ్డి తదితరులు

అంకితభావంతో పని చేయాలి

నకరికల్లు: పార్టీలో పదవులు పొందినవారు అంకితభావంతో పని చేయాలని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. నకరికల్లులో పార్టీ కార్యాలయాన్ని గురువారం సుధీర్‌భార్గవ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన్ను నకరికల్లు పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన బైరెడ్డి పరమేశ్వరరెడ్డి గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీలో పునరుత్తేజం నింపడానికి అనుబంధ సంఘాల బాధ్యులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ షేక్ హుస్సేన్, వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బిబాషా, సోషల్‌మీడియా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పాలూరి రాజశేఖర్‌రెడ్డి, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ సలీల్, కేసరి నరసింహారెడ్డి, కొణతం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూనె పదార్థాలతో ఊబకాయం

అచ్చంపేట: నూనె పదార్థాలతో ఊబకాయం వస్తుందని, కొవ్వు పేరుకుపోతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పద్మ తెలిపారు. 8వ రాష్ట్రీయ పోషక మాసత్సవాల్లో భాగంగా మండలంలోని పెదపాలెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యాన గురువారం జరిగిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన మితాహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. పాలు, గుడ్లు తీసుకుంటే పుట్టిన బిడ్డకు సమృద్ధిగా పాలు పడతాయని సూచించారు. పీహెచ్‌సి వైద్యాధికారి కె.స్రవంతి పద్మమాట్లాడుతూ చిన్నపిల్లలకు చిన్నతనం నుంచే పోషక విలువలతో కూడిన ఆహార అలవాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నెల్లూరి హరిబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ కె.పార్వతి, ఎంఎల్‌హెచ్‌పీ శివనాగమణి, ఏఎన్ఎం సుశీల, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశావర్కర్స్, గర్భిణులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

మాచర్ల: స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యాన్నదానం కొనసాగుతున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి గురువారం తెలిపారు. ప్రతిరోజు రద్దీ ప్రాంతాల్లో పేదలకు మూడు పూటలా ఆహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మూగజీవులకు కూడా ఆహారం పెడుతున్నట్లు చెప్పారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో సేవలు చేస్తున్నట్లు వివరించారు.

అదుపు తప్పిన వాహనం.. యువకుడి మృతి

గుడిపూడిలో ఘటన

సత్తెనపల్లి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడటంతో యువకుడు మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గుడిపూడిలోని సైబన్ వద్ద జరి గింది. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామానికి చెందిన కొమ్ము గోపి(28) కంటిపూడి సమీపంలోని నలంద ఇంజినీరింగ్ కళాశాలలో సెక్యూరిటీ గార్డు. బుధవారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు పెదమక్కెన గ్రామానికి వస్తున్న క్రమంలో గుడిపూడి- పెదమక్కెన గ్రామాల మధ్య ఉన్న సైబన్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. అతను రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆ సమయంలో సత్తెనపల్లి నుంచి పెదకూరపాడు వైపు వస్తున్న సత్తెనపల్లి పోలీసులు గమనించి ప్రత్యేక వాహనంలో ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యానికి గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న గోపి గురువారం ఉదయం మృతి చెందారు. మృతుడికి భార్య అనూష, ఇద్దరు సంతానం ఉన్నారు. గోపి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గోపీ మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి సత్తెనపల్లిరూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు కొమ్ము గోపి

ఆస్పత్రుల్లో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

క్రోసూరు: ఆస్పత్రుల్లో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని, పీహెచ్‌సీ వైద్యులు గఫ్రూన్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్ ఫాతిమాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ గఫ్రూన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్ అందుబాటులో లేకపోయినా, ప్రజలకు మొదట సలహా ఇచ్చే వారే ఫార్మసిస్టులని , కొత్త మందులు వస్తున్న నేపథ్యంలో వారి పాత్ర మరింత కీలకమన్నారు. కోవిడ్ 19 సమయంలో టీకాలు, మందులు పంపిణీ, ప్రజలకు అవగాహన కల్పించడంలో వారు చేసిన కృషి అమోఘం అన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ డాక్టర్ ఇచ్చిన ప్రిస్క్రిప్షన్‌ను సాధారణ భాషలో రోగికి అర్థమయ్యేలా చెప్పేది కూడా ఫార్మసిస్ట్ మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ రాజ్యలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫార్మసిస్ట్ ఫాతిమాను సన్మానిస్తున్న డాక్టర్ గఫ్రూన్, సిబ్బంది

ఈ-పంట నమోదు పూర్తిచేయాలి

నరసరావుపేట రూరల్: ఈ - పంట నమోదును త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. యల్లమంద గ్రామ రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. ఎరువుల లభ్యత, పంటల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ వినియోగంపై ట్రైనర్‌తో ముఖాముఖి మాట్లాడి ప్రత్యక్ష పరిశీలన జరిపారు. అనంతరం రావిపాడు గ్రామంలోని యూనియన్ బ్యాంకులో అధికారులతో సమావేశమయ్యారు. కౌలు రైతులకు, జాయింట్ లైబిలిటీ గ్రూపులకు పెట్టుబడి సాయం కింద రుణాలు మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు బ్యాంక్ అధికారులను కోరారు.

బాధితుడిని ఆదుకోండి

పిడుగురాళ్ల: విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నష్టపోయిన వ్యక్తిని ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కారంపూడి మండలం పెదకొదమగుండ్ల గ్రామంలో సాగర్‌బాబును బలవంతంగా స్తంభంపైకి ఎక్కించడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడి కాళ్లు, చేతులు కోల్పోయాడని చెప్పారు. విద్యుత్ శాఖ లైన్‌మెన్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లైన్‌మెన్ పరబ్రహ్మంచారి, ఏఈలు దీనికి కారణమని ఆరోపించారు. నేటికీ బాధితుడికి న్యాయం జరగలేదని వాపోయారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీను, సీపీఐ మండల కార్యదర్శి బాలయ్య, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి ఓర్స్ కృష్ణ, అంబేడ్కర్ ప్రచార సమితి అధ్యక్షుడు దేగల అబ్రహాం, మాల మహానాడు నేత గోదా బాల, కె.కుమార, పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, ప్రసాదు, మాల మహానాడు నాయకురాలు చిట్టిమల్ల మేరి, జి. కీర్తన, ఎస్. పద్మ తదితరులు పాల్గొన్నారు.

జాషువా ఆశయాలను కొనసాగించాలి

పిడుగురాళ్ల: కవి జాషువా ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని రిటైర్డ్ జడ్జి కూచిపూడి ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని లెనిన్ నగర్‌లో కార్స్ సంస్థ ఆధ్వర్యంలో జాషువా జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశం గర్వించదగ్గ కవి జాషువా అని, ఆయన రచనలు సామాజిక మార్పులకు దోహదం చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏపీపీ పరిసపోగు సునీల్, కృష్ణ జిల్లా సీనియర్ కవి పి.అనిల్, బలహీన వర్గాల పల్నాడు అధ్యక్షులు నల్లబోతుల రాజు, జెట్టిపోగు ఏసురత్నం, అశోక్‌బాబు, దేగల అబ్రహాం, స్కూల్ హెచ్ఎం పి.లత, పి.దయామణి, ఎల్.కీర్తన, ఎస్‌కే రహీం, సురేష్, చందు, అన్నారావు పాల్గొన్నారు.